ప్రజాశక్తి
గురువారం 24 అక్టోబర్ 2024

అల్లూరి సీతారామరాజు

మద్యాన్ని అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు

-ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ సిఐ కూర్మారావు

ప్రజాశక్తి -చింతపల్లి: మద్యం దుకాణాలలో ఎమ్మార్పీ ధరల కంటే అధిక ధరలకు మద్యాన్ని అమ్మినా, గొలుసు దుకాణాలు (బెల్ట్ షాపులు) నిర్వహించినా చర్యలు చేపడతామని స్థానిక ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ సర్కిల్ ఇన్స్పెక్టర్ జె కూర్మారావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వం నూతన మద్యం పాలసీలో భాగంగా ప్రైవేటు వ్యక్తులకు కేటాయించిన మద్యం దుకాణాలకు ప్రస్తుతం ప్రొవిజినల్ లైసెన్స్ మంజూరు చేయడం జరిగిందన్నారు. మద్యం దుకాణాలు పొందిన డీలర్లు ఎట్టి పరిస్థితుల్లోనూ ఎమ్మార్పీ ధరల కంటే అధిక ధరలకు విక్రయించరాదన్నారు. లూజ్ సేల్స్ చేయరాదని, పర్మిట్ రూములు నిర్వహించరాదని, గొలుసు దుకాణాలను ఏర్పాటు చేయరాదని తెలిపారు. ఈ నెల 31 వరకు ప్రొవిజినల్ లైసెన్స్ గడువు పెంచారని తెలిపారు. మద్యం డీలర్లు ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా అమ్మకాలు చేపడితే కేసులు నమోదు చేస్తామని వెల్లడించారు.

గిరిజనులకు తప్పని డోలి కష్టాలు

- రోడ్డు సౌకర్యం లేక ఇబ్బందులు
-ఆసుపత్రికి తరలించేందుకు అవస్థలు

ప్రజాశక్తి -అనంతగిరి: మండలంలోని గుమ్మ పంచాయతీ కర్రిగుడ గ్రామంలో గర్భిణీ, రోగులను డోలి కష్టాలు వెంటాడుతున్నాయి. రోడ్డు సౌకర్యం లేక గ్రామానికి అంబులెన్స్, ఇతర వాహనాలు చేరలేదు. గత్యంతరం లేక ఎత్తయిన కొండ కోనలు అటవీ ప్రాంతం మార్గ ద్వారా కిలోమీటర్ల దూరం డోలి సహాయంతో కుటుంబ సభ్యులు వైద్యం నిమిత్తం తరలించవలసిన పరిస్థితి ఏర్పడుతుంది.

ఈనెల 20 తేదీన ఓ నిండు గర్భిణీకి పురిటి నొప్పులు రావడంతో కుటుంబ సభ్యులు కర్రలతో డోలి కట్టి కర్రిగుడ గ్రామం నుండి ఎత్తయిన కొండ కోనల నడుమ 8 కిల్లో మీటర్లు దూరం గుమ్మ పంచాయతీకి తరలించారు. అక్కడ నుంచి ఆటోలో ఎస్.కోట ప్రభుత్వాసుపత్రికి వైద్యం నిమిత్తం తరలించారు. ఈ ఘటన మరువకే ముందే బుధవారం అదే గ్రామానికి చెందిన కొర్రా రాధమ్మ 8 నెలల మొదటి కానుపులో రక్తహీనతతో ఒళ్లంతా ఉబ్బసంతో నడవలేని పరిస్థితి తలెత్తింది. దీంతో, కుటుంబ సభ్యులు వైద్యం నిమిత్తం బుధవారం గ్రామం నుండి ఉదయం 8. గంటలకు కర్రలతో డోలి కటి గుమ్మ పంచాయతీ గ్రామం వరకు తరలించారు. ఆటోలో ఎక్కించగా కొంత దూరం వెళ్లిన అనంతరం ఆటో సాంకేతిక లోపంతో నిలిచిపోయింది. 11 గంటల నుండి మూడు గంటల వరకు ఎటువంటి వాహనం అందుబాటు లేక పోవడంతో అక్కడే ఉండిపోయారు. 108 అంబులెన్స్‌కు ఆశ్రయించినా ఫలితం లేదు. అనంతరం మరో ఆటోను ఆశ్రయించి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ వైద్యులు పరీక్షలు నిర్వహించిన అనంతరం రక్తహీనత ఉందని వెంటనే ఎస్.కోట ఏరియా ఆసుపత్రికి రిఫర్ చేశారు. అక్కడ నుండి సాయంత్రం అంబులెన్స్ ద్వారా ఎస్.కోట ఏరియా ఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్య సేవల కోసం పరీక్షలు నిర్వహిస్తున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు

డోలీలో తరలిస్తున్న కుటుం సభ్యులు

ఫారెస్ట్ అధికారుల అభ్యంతరంతో నిలిచిన రోడ్డు

మారుమూల గిరిజన గ్రామాలకు రోడ్డు సౌకర్యం కల్పించాలనే లక్ష్యంతో పాడేరు ప్రాజెక్టు కనెక్టివిటీ కింద 2020-21 సంవత్సరంలో రాష్ట్ర ప్రభుత్వం ట్రైబల్ వెల్ఫేర్ పథకం కింద కోట్ల రూపాయలు నిధులు మంజూరు చేసింది. సంబంధిత అధికారులు నిమ్మఊట గ్రామం నుండి రోడ్డు పనులు మొదలు పెట్టారు. మూడు కిలోమీటర్లు వరకు పనులు చేపట్టగా ఫారెస్ట్ అధికారులు పనులకు ఆటంకం కల్పించడంతో నిలిపివేశారు. సంవత్సరాలు గడుస్తున్నప్పటికీ పనులు మొదలు పెట్టలేదు. దీంతో కర్రిగుడ, కడరేవు, ముల్లేలతో పాటు మరో ఐదు గ్రామాల ప్రజలు, గర్భిణిలు. అనారోగ్యానికి గురైతే వారిని ఆసుపత్రులకు తరలించాలంటే డోలిలే ఆధారంగా మారాయి. ఇప్పటికైనా ప్రభుత్వం తక్షణమే రోడ్డు పనులు పునఃప్రారంభించి పూర్తి చేయాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు

అనుమతి లేకుండా కలపను తరలిస్తే చర్యలు

ప్రజాశక్తి-డుంబ్రిగుడ: అటవీ శాఖ అనుమతి లేకుండా సిల్వర్ ఓక్, నీలగిరి, అకేసియా వంటి చెట్లను అనధికారికంగా తరలిస్తే అటువంటి వారిపై చర్యలు తప్పవని అటవీ శాఖ రేంజ్ అధికారి శ్రీనివాసరావు హెచ్చరించారు. మండలంలోని సావ్వా పంచాయితీ సొవ్వ, కాగువలస, మాలివలస, పనసవలస, ఒడియావలస, గొప్పులవలస గ్రామాల్లో సందర్శించి తోటలను పరిశీలించారు. అక్కడక్కడ నీలగిరి, అకేసియా చెట్లు నరికి తరలించడానికి స్టాక్ చేసి ఉంచి ఉండటాన్ని గుర్తించారు. అనధికారికంగా తరలించడానికి సిద్ధంగా ఉంచినట్లు గుర్తించడం జరిగిందని, దీనిపై వాస్తవాలను వెలికి తీసి చర్యలు తీసుకోవడానికి ఉన్నత అధికారులకు సిఫార్సు చేయడం జరుగుతుందని తెలిపారు.

కలపను పరిశీలిస్తున్న అటవీ శాఖ రేంజ్ అధికారి శ్రీనివాసరావు

కాఫీ రైతులకు గిట్టుబాటు ధర కల్పించండి

-జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్

కలెక్టర్‌తో మాట్లాడుతున్న అధికారులు

ప్రజాశక్తి-పాడేరు: అరకు కాఫీకి గిట్టుబాటు ధర కల్పించాలని జిల్లా కలెక్టర్ ఎ.ఎస్. దినేష్ కుమార్ సూచించారు. బుధవారం ఆయన కార్యాలయంలో ఐటిసి కంపెనీ అధికారులు, కాఫీ అధికారులతో కాఫీ విక్రయాలపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, అరకు కాఫీని గిరిజన రైతులు ఆర్గానిక్ విధానంలో సాగు చేస్తున్నారన్నారు. కాఫీ రైతులకు మంచి ధర చెల్లించాలని స్పష్టం చేసారు. చింతపల్లి మాక్స్ సంస్థ సేకరిస్తున్న కాఫీని బహిరంగ వేలం ద్వారా విక్రయిస్తామన్నారు. కాఫీ సేకరణలో తగిన నాణ్యతలు పాటించాలని సూచించారు. కాఫీ రైతులకు జియో ట్యాగింగ్ చేయడానికి చర్యలు చేపట్టాలని ఆదేశించారు. కాఫీ నాణ్యతపై లైజన్ వర్కర్లకు అవగాహన కల్పించాలని చెప్పారు. చింతపల్లి మాక్స్ సంస్థ ఈ ఏడాది 600 టన్నుల పార్చిమెంట్ కాఫీని ఉత్పత్తి చేస్తోందన్నారు. గిరిజన కాఫీని బహిరంగ వేలంలో విక్రయిస్తామన్నారు.

ఐటిసి అధికారులు వాసు దేవమూర్తి, కిరీట్ పాండే మాట్లాడుతూ, మాక్స్ కాఫీ వేలంలో పాల్గొంటామని చెప్పారు. కాఫీ విక్రయాలు, వేలం సమయంలో సమాచారం అందించాలని కోరారు. ఈ సమావేశంలో కాఫీ బోర్డు డిడి. ఎస్.రమేష్, ఐటిడి ఏ కాఫీ సహాయ సంచాలకులు ఎన్.అశోక్, ఐటిడిఏ ఏవో ఎం.హేమలత తదితరులు పాల్గొన్నారు.



నినాదాలు చేస్తున్న కాఫీ కార్మిక సంఘం నేతలు చిన్నయ్యపడాల్, సత్యనారాయణ, కార్మికులు

కాఫీ కార్మికుల సమస్యలు పరిష్కరించకుంటే..

సమ్మె చేపట్టేందుకు వెనుకాడం

కాఫీ కార్మిక సంఘం నేతలు చిన్నయ్య పడాల్, సత్యనారాయణ

ప్రజాశక్తి-చింతపల్లి: కాఫీ యాజమాన్యం కార్మికుల సమస్యల పరిష్కారానికి మొండికేస్తే సమ్మె సైరన్ మోగించి ముందుకెళ్తామని కాఫీ కార్మిక సంఘం జిల్లా గౌరవ అధ్యక్షులు బోనంగి చిన్నయ్య పడాల్, జి.సత్యనారాయణ తెలిపారు. స్థానిక ఆర్ అండ్ బి కార్యాలయం ఆవరణలో బుధవారం సమావేశాన్ని ఏర్పాటు చేశారు. అనంతరం కాఫీ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ,ఈ నెల 15 న పది డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని కాఫీ కార్మికులు, హెల్పర్ల ద్వారా కాఫీ యాజమాన్యానికి సమర్పించామన్నారు. ఈనెల 19న సమస్యలపై తూతూ మంత్రంగా చర్చలు జరిపి ఉన్నతాధికారులకు తెలియజేస్తామని చెప్పి చేతులు దులుపుకున్నారని మండిపడ్డారు.డివిజన్ల వారీగా సదస్సులు, సమావేశాలు ఏర్పాటు చేసి సమ్మెకు కార్మికులను సంసిద్ధం చేస్తామన్నారు.ఏపీఎఫ్‌డిసి సంస్థను రక్షించాలంటే క్షేత్రస్థాయి సిబ్బంది ప్లాంటేషన్ కండక్టర్, 300 మంది కింది స్థాయి ఉద్యోగులను నియమించకుండా సంస్థను రక్షించలేరన్నారు. ఏపీఎఫ్‌డిసి రక్షణకే కార్మికులు పోరాటం చేస్తున్నారన్నారు. కాఫీ యాజమాన్యం నిర్లక్ష్య వైఖరి విడనాడి మళ్లీ కార్మికులతో చర్చలు జరిపి సమస్యను పరిష్కరించాలని యాజమాన్యాన్ని కోరారు. లేనిపక్షంలో సమ్మెకు సిద్ధమవుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కార్మిక సంఘం జిల్లా అధ్యక్షురాలు ఎన్.కనకవల్లి, హెల్పర్ల యూనియన్ నేతలు మోరి గిరి, బి పాపారావు, వెంకటేష్, శివ, తదితరులు పాల్గొన్నారు.

కడవరకు ఎర్రజెండా నీడలో..

- గుండెపోటుతో సిపిఎం సీనియర్ నాయకులు పూనెం సత్యనారాయణ హఠాన్మరణం
- పార్టీలకతీతంగా పలువురు నివాళి
- యుక్త వయస్సులోనే ప్రజా ఉద్యమ ప్రస్థానం
- అనేక పోరాటాలకు నాయకత్వం
- ప్రజా ప్రతినిధిగానూ సేవలు

పూనెం సత్యనారాయణ పార్థికదేహంపై సిపిఎం జెండాను కప్పుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి బి.కిరణ్, రోధిస్తున్న భార్య, కుమార్తె, కుమారుడు

పోలవరం పోలికేక పాదయాత్రలో పాల్గొన్న పూనెం సత్యనారాయణ (ఫైల్‌ఫొటో)

ప్రజాశక్తి-విఆర్.పురం

గుండె పోటుతో బుధవారం హఠాన్మరణం చెందిన సిపిఎం సీనియర్ నాయకులు, మాజీ సర్పంచ్ పూనెం సత్యనారాయణ (54) నమ్మిన సిద్ధాంతం కోసం, ఎత్తిన జెండాను దించకుండా ఎర్ర జెండా నీడలోనే కడవరకు కొనసాగారు. సత్యనారాయణ బుధవారం తన పొలంలో మినుము విత్తనాలు వేస్తుండగా, గుండెపోటుకు గురై కుప్పకూలి పడిపోయారు. ఆయన సతీమణి సరోజిని, కూలీలు సత్యనారాయణను హుటా హుటీన రేఖపల్లి ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తీసుకెళ్లారు. అక్కడి నుండి అంబులెన్స్‌లో కూనవరం మండలం కోతులగుట్ట ఏరియా ఆసుపత్రికి తరలించారు. అప్పటికే పరిస్థితి విషమించి సత్యనారాయణ మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మండలంలోని పెదమట్టపల్లి పంచాయతీ నూతిగూడెం గ్రామానికి చెందిన పూనెం లక్ష్మయ్య, రాములమ్మ దంపతులకు సత్యనారాయణ మూడో కుమారుడు. సత్యనారాయణకు భార్య సరోజినీ, కుమారులు కిరణ్, ప్రదీప్‌కుమార్, కుమార్తె సుజాత ఉన్నారు.

ఉద్యమ ప్రస్థానం

భద్రాచలం మాజీ ఎమ్మెల్యే సున్నం రాజయ్య చొరవతో పూనెం సత్యనారాయణ యువజన సంఘం డివైఎఫ్ఐ ద్వారా 40 ఏళ్ల క్రితం యుక్త వయస్సులోనే ప్రజా ఉద్యమ ప్రస్థానాన్ని ప్రారంభించారు. యువజన సంఘంతో పాటు గిరిజన సంఘం, రైతు, వ్యవసాయ కార్మిక సంఘాలు, సిఐటియులో పలు బాధ్యతలు నిర్వర్తించారు. సిపిఎం విఆర్.పురం మండల కార్యదర్శిగా మూడు పర్యాయాలు పనిచేశారు. ప్రస్తుతం సిపిఎం ఎఎస్ఆర్ రంపచోడవరం జిల్లా కమిటీ సభ్యులుగా, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులుగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. భద్రాచలం మాజీ ఎమ్మెల్యేలు కీర్తిశేషులు కుంజా బొజ్జి, సున్నం రాజయ్య, మాజీ ఎంపీ డాక్టర్ మిడియం బాబురావుకు సత్యనారాయణ అనుయాయుడు.

అనేక పోరాటాలకు నాయకత్వం

మండలంలో ప్రజా సమస్యలపై సాగిన ప్రతి పోరాటంలోనూ సత్యనారాయణ ముందు వరుసలో ఉండేవాడు. విలీన మండలాల్లోని పోలవరం నిర్వాసితుల పోరాటంతో ముఖ్య భూమిక పోషించారు. చొక్కానపల్లి, జీడిగుప్ప, శబరి రాయగూడెం, చొప్పల్లి, చింత రేఖపల్లి గ్రామాల్లో భూమి పోరాటాలు చేశారు. మండలంలో పోడు భూములకు పట్టాలివ్వాలని, రేఖపల్లి పంచాయతీలో ఇంటి స్థలాలు ఇవ్వాలని ఉద్యమించారు. తునికాకు కార్మికుల సమస్యలతో పాటు ఆశా, అంగన్వాడీ, మిడ్డేమీల్స్, హాస్టల్ వర్కర్లు వంటి కార్మికుల సమస్యలపై చేపట్టిన పోరాటాల్లో సత్యనారాయణ కీలక పాత్ర పోషించారు. ఈ పోరాటాల సందర్భాల్లోనే అక్రమ కేసులకు గురై జైలు జీవితం గడిపారు.

నేడు అంత్యక్రియలు

సిపిఎం నేత కామ్రేడ్ పూనెం సత్యనారాయణ అంత్యక్రియలు గురువారం ఉదయం నిర్వహిస్తున్నట్లు పార్టీ నాయకులు తెలిపారు. గురువారం ఉదయం 10 గంటలకు రేఖపల్లిలో సంతాప సభ నిర్వహించి, అనంతరం రేఖపల్లి నుంచి నూతిగూడెం వరకు బైక్ ర్యాలీతో సత్యనారాయణ అంతిమ యాత్ర 12 గంటలకు ఉంటుందని పేర్కొన్నారు. అనంతరం నూతిగూడెంలో అంత్యక్రియలు జరుగుతాయని, ఈ కార్యక్రమానికి పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ప్రజలు హాజరు కావాలని కోరారు.

ప్రజాప్రతినిధిగా..

పూనెం సత్యనారాయణ పెద్దమట్టపల్లి మేజర్ పంచాయతీ సర్పంచ్‌గా పని చేశారు. ఉద్యమ అవసరాల రీత్యా మండల కేంద్రం రేఖపల్లికి వచ్చిన ఆయన ఇక్కడ సిపిఎం, ప్రజా సంఘాల నాయకులుగా గుర్తింపు పొందారు. గత పంచాయతీ ఎన్నికల్లో రేఖపల్లి మేజర్ పంచాయతీ సర్పంచ్‌గా సత్యనారాయణ భార్య సరోజినీ ఎన్నికయ్యారు. సత్యనారాయణ చిన్న కుమారుడు పూనెం ప్రదీప్‌కుమార్ చిన్నమట్టపల్లి ఎంపిటిసి సభ్యులుగా ప్రస్తుతం పని చేస్తున్నారు. తన పరిధిలో ఎవరికి ఏ కష్టమొచ్చినా, ఏ సమస్య వచ్చినా, ఎవరు అపదలో ఉన్నా సత్యనారాయణ వారి వెన్నెంటే ఉండి వారి కష్టసుఖాల్లో పాలుపంచుకునేవారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీకి చెందిన ప్రజా ప్రతినిధులను గెలిపించుకోవడంలో సిసలైన వ్యూహకర్తగా సత్యనారాయణకు పేరుంది. అటు పార్టీలో, ఇటు ప్రజల్లోనూ అత్యంత ప్రజాదరణ కల్గిన సత్యనారాయణ అకాల మరణం వారి కుటుంభ సభ్యులతోపాటు, సిపిఎం, ప్రజా సంఘాలకు తీరనిలోటు.

పార్టీలకతీతంగా పలువురు నివాళి

సత్యనారాయణ మరణ వార్త తెలిసి స్థానిక ప్రజా ప్రతినిధులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు, ప్రజా సంఘాల నాయకులు, సత్యనారాయణ పార్థివ దేహాన్ని సందర్శించి ఘనంగా నివాళులర్పించారు. సత్యనారాయణ కుటుంబ సభ్యులను ఓదార్చారు. సిపిఎం నాయకులు సత్యనారాయణ పార్థివ దేహంపై ఎర్ర జెండా కప్పి శ్రద్ధాంజలి ఘటించారు. నివాళు లర్పించిన వారిలో ప్రముఖ ఆయుర్వేద వైద్యులు, టిడిపి నాయకులు జమాల్ ఖాన్, జెడ్‌పిటిసి వాళ్ల రంగారెడ్డి, వైసిపి నాయకులు మరియదాసు, ముత్యాల శ్రీనివాసరావు, బిజెపి నాయకులు ముత్యాల రాంబాబు, సిపిఐ నాయకులు కాకి వెంకటేశ్వర్లు సత్యనారాయణ, సిపిఎంకు చెందిన విఆర్.పురం ఎంపిపి కారం లక్ష్మి, కూనవరం వైస్ ఎంపిపి కొమరం పెంటయ్య, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి పల్లపు వెంకట్, మండల కార్యదర్శి రాజేశ్వరి, యుటిఎఫ్ నాయకులు సోడి నాగేశ్వరరావు, సిపిఎం జిల్లా నాయకులు మేకల నాగేశ్వరరావు, చింతూరు మండల నాయకలు ఎర్రంశెట్టి శ్రీనివాసరావు, కూనవరం మండల నాయకులు తళ్లూరి శ్రీనివాసరావు, విఆర్.పురం మండల కార్యదర్శి సోయం చిన్నబాబు, శ్రీరాంగిరి సర్పంచ్ పులి సంతోష్‌కుమార్, మండల నాయకులు కారం సుందరయ్య, పొడియం శ్రీరామ్మూర్తి, వడ్లాది రమేష్, సోడి మల్లయ్య, కారం సత్తిబాబు, తుర్రం బాబూరావు, పండా వెంకటేశ్వర్లు తదితరులు ఉన్నారు.

పుష్పగుచ్ఛాలతో నివాళులర్పిస్తున్న సిపిఎం జిల్లా నేత వాణిశ్రీ

నివాళులర్పిస్తున్న ఆయుర్వేద వైద్యులు జమాల్‌ఖాన్, సిపిఎం నేతలు

పూనెం మరణం పార్టీకి తీరనిలోటు : సిపిఎం జిల్లా కార్యదర్శి కిరణ్

పూనెం సత్యనారాయణ అకాల మరణం సిపిఎంకు తీరని లోటని ఆ పార్టీ రంపచోడవరం జిల్లా కార్యదర్శి బొప్పెన కిరణ్, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు మట్ల వాణిశ్రీ అన్నారు. సత్యనారాయణ పార్థివ దేహాన్ని బుధవారం రాత్రి వారు సందర్శించి ఎర్రజెండా కప్పి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సత్యనారాయణ నిబద్ధత కలిగిన నాయకుడని, నిస్వార్థ రాజకీయాలకు ఆయన మారుపేరని పేర్కొన్నారు. అమర జీవులు కామ్రేడ్స్ సున్నం రాజయ్య, కామ్రేడ్ కుంజా బొజ్జి, కారం శిరమయ్యల వారసత్వాన్ని పునికి పుచ్చుకొని మండలంలో ఎనలేని సేవలు అందించారని కొనియాడారు. సత్యనారాయణ ఆశయ సాధనకు పార్టీ జిల్లా నాయకత్వం కృషి చేస్తుందని చెప్పారు. పూనెం కుటుంబ సభ్యులకు సానుభూతిని తెలియజేస్తూ... వారి కుటుంబానికి పార్టీ అన్ని విధాల అండదండలుగా నిలబడుతుందని చెప్పారు.

నిరంతర పోరాట నాయకుడు : లోతా రామారావు

రాజవొమ్మంగి : సిపిఎం సీనియర్ నాయకులు పూనెం సత్యనారాయణ హఠాన్మరణం తీవ్ర దిగ్భ్రాంతి కల్గించిందని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు లోతా రామారావు, సిపిఎం సిఐటియు మండల నాయకులు పి.రామరాజు, టి.శ్రీను, కె.వెంకటలక్ష్మి, కె.జగన్నాథం, కె.సూరిబాబు, తదితరులు బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సత్యనారాయణ మృతికి సంతాపం తెలియజేశారు. సిపిఎం సీనియర్ నేతగా విలీన మండలాల్లో విశేష సేవలు అందించారని తెలిపారు. ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడే వ్యక్తిని పార్టీ కోల్పోయిందని, ఆయన మరణం పార్టీకి తీరని లోటని తెలిపారు. సత్యనారాయణ కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

పాడేరు ప్రభుత్వ వైద్య కళాశాలకు గాము మల్లుదొర పేరు పెట్టాలి

ప్రజాశక్తి -సీలేరు : అల్లూరి సీతారామరాజు జిల్లా కేంద్రంలోని పాడేరు ప్రభుత్వ వైద్య కళాశాలకు గిరిజన స్వాతంత్ర్య సమరయోధుడు, అల్లూరి ముఖ్య అనుచరుడు, విశాఖపట్నం తొలి పార్లమెంట్ సభ్యుడు గాము మల్లుదొర పేరుతో నామకరణం చేయాలని కాంగ్రెస్ బీసీ సెల్ జిల్లా కన్వీనర్ కారే శ్రీనివాస్ ముఖ్యమంత్రికి విజ్ఞప్తి చేశారు. స్థానిక విలేకరులతో బుధవారం ఆయన మాట్లాడుతూ మహనీయుల త్యాగాలను, వారి గొప్పతనాన్ని భావితరాలకు అందించే ఉద్దేశంతో కృష్ణా జిల్లా మచిలీపట్నం వైద్య కళాశాలకు జాతీయ జెండా రూపకర్త పింగళి వెంకయ్య పేరు పెడుతూ ప్రభుత్వం జీవో జారీ చేయడం శుభ పరిణామమని పేర్కొన్నారు. గాము మల్లదొర అల్లూరి సీతారామరాజు నేతృత్వంలో దేశ స్వాతంత్ర్యం కోసం బ్రిటిష్ సామ్రాజ్యవాదంపై పోరాడిన గొప్ప యోధుడని గుర్తు చేశారు. ఆ పోరాటంలో బ్రిటీష్ సైనికులకు పట్టుబడి అండమాన్ దీవుల్లో దిపాంతర కారాగార శిక్ష అనుభవించారని పేర్కొన్నారు. స్వాతంత్ర్యం అనంతరం జైలు నుంచి విడుదలైన గాము మల్లుదొర మొట్టమొదట సార్వత్రిక ఎన్నికలలో విశాఖపట్నం నుంచి ఎంపీగా పోటీ చేసి ఎన్నికయ్యారని గుర్తు చేశారు. దేశమాత సేవలో తన జీవితమంతా గడిపారని, ఆయన ఎన్నో త్యాగాలు చేశారని చెప్పారు. అటువంటి గొప్ప స్వాతంత్ర్య సమరయోధుని పేరును అల్లూరి జిల్లా పాడేరు వైద్య కళాశాలకు పెట్టడం సముచితమని, ఆ దిశగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టి గాము మల్లుదొర పేరును పెడుతూ పెడుతూ జిఒను వెంటనే విడుదల చేయాలని కారే శ్రీనివాస్ విజ్ఞప్తి చేశారు.

మాట్లాడుతున్న ఎంపిడిఒ కుమార్

ఉపాధి హామీ పనులపై సమీక్ష

ప్రజాశక్తి -అనంతగిరి: మండలంలోని జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా చేపడుతున్న భూ అభివృద్ధి పనులపై సంబంధిత ఫీల్డ్. టెక్నికల్ అసిస్టెంట్ లతో బుధవారం సమీక్ష సమావేశం నిర్వహించామని ఎంపీడీవో ఏవివి.కుమార్ కుమార్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. మండలంలోని ఉపాధి హామీ లబ్ధిదారులకు పనులపై అవగాహన కల్పించాల న్నారు. కూలి సొమ్ము చెల్లింపులపై సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఏపీవో నాయుడు, సిబ్బంది పాల్గొన్నారు.

మూగజీవాల సంచారంపై వినతి

ప్రజాశక్తి - చింతపల్లి : మండల కేంద్రంలో రోడ్లపై సంచరించే పందులను నివారించాలని, అదే క్రమంలో గ్రామంలో విచ్చలవిడిగా తిరుగుతూ ప్రమాదాలకు కారణమవుతున్న పశువులను వాటి యజమానులు సంరక్షించుకునేలా చర్యలు చేపట్టాలని చింతపల్లి 2 ఎంపీటీసీ సభ్యురాలు చిందాడ జయలక్ష్మి అన్నారు. మంగళవారం నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో స్థానిక ఈ వో పి ఆర్డి శ్రీనివాసరావు దృష్టికి ఆమె ఈ సమస్యలను తీసుకువచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, పందులు, పశువుల విచ్చలవిడి సంచారంతో అనేక సమస్యలు తలెత్తుతున్నాయన్నారు. పశువులతో ప్రమాదాలు చోటు చేసుకోవడమే గాక, పందులతో వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందన్నారు. గ్రామంలో పందుల సంఖ్య విపరీతంగా పెరిగిపోవడంతో అపారిశుధ్యం నెలకొంటుందన్నారు.

పోలియో పట్ల అప్రమత్తం

-డాక్టర్ సాయి సునీల్ కిషోర్

ప్రజాశక్తి - ఎంవిపి కాలనీ : పోలియో వ్యాధి పట్ల అప్రమత్తంగా ఉండాలని మెడికవర్ హాస్పిటల్‌లోని చీఫ్ నియోనాటాలజిస్ట్, పీడియాట్రిక్ ఇంటెన్సివిస్ట్ క్లినికల్ హెడ్ డాక్టర్ సాయి సునీల్ కిషోర్ సూచించారు. భారతదేశంలోని మేఘాలయలో ఇటీవల బయటపడిన పోలియో కేసు నేపథ్యంలో ప్రపంచ పోలియో దినోత్సవం సందర్భంగా ఆయన పలు వివరాలు వెల్లడించారు. పోలియోమైలిటిస్ వల్ల కలిగే నిరంతర ముప్పును గుర్తించడం చాలాఅవసరం అన్నారు. పోలియో, ఒక తీవ్రమైన వైరల్ అంటువ్యాధి అని, ప్రధానంగా ఐదేళ్లలోపు పిల్లలను ప్రభావితం చేస్తుందని తెలిపారు. ఇది కోలుకోలేని పక్షవాతం, కొన్ని సందర్భాల్లో మరణానికి దారితీస్తుందని వివరించారు. దశాబ్దాలుగా పురోగతి ఉన్నప్పటికీ, ఈ వ్యాధి ప్రపంచ ఆరోగ్యానికి ముప్పుగా మిగిలిపోయిందని, ముఖ్యంగా పోలియో రహిత భారత్ వంటి దేశాలలో ఇది మరలా రాకుండా నివారించడానికి అప్రమత్తంగా ఉండాలని చెప్పారు. ఇనాక్టివేటెడ్ పోలియో వ్యాక్సిన్ పోలియో వైరస్ వ్యాప్తిని ఆపడానికి నిరూపితమైన సమర్ధవంతమైన సాధనమని, 6 వారాలకు వ్యాక్సిన్‌ను ప్రారంభించడం వల్ల పిల్లలు జీవితకాల రోగనిరోధక శక్తిని పెంపొందించడంలో సహాయపడుతుందని వివరించారు.

నేడు జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : ఉమ్మడి విశాఖ జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ అధ్యక్షతన జడ్పీ సమావేశ మందిరంలో గురువారం జరగనుందని, ఈ మేరకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి పి.నారాయణమూర్తి బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని అన్ని విభాగాల అధికారులు పూర్తి నివేదికలతో హాజరు కావాలని విజ్ఞప్తి చేశారు. సర్వసభ్య సమావేశం ఉదయం 10.30 గంటల నుంచి కొనసాగుతుందని, సభ్యులు, అధికారులు భాగస్వామ్యమై విజయవంతం చేయాలని కోరారు.

జిల్లా అభివృద్ధికి సూచనలందించాలి

గిరిజన సంఘాలకు కలెక్టర్ దినేష్‌కుమార్ సూచన

మాట్లాడుతున్న కలెక్టర్ దినేష్‌కుమార్

ప్రజాశక్తి -పాడేరు : గిరిజనుల ఆకాంక్షల మేరకు జిల్లాను అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడానికి కృషి చేస్తామని జిల్లా కలెక్టర్ ఎ. ఎస్. దినేష్ కుమార్ తెలిపారు. బుధవారం కలెక్టరేట్ మిని సమావేశ మందిరంలో జిల్లా వ్యాప్తంగా ఉన్న పలు గిరిజన సంఘాల నేతలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జిల్లాలో విద్య, ఉద్యోగ అవకాశాలు, వైద్య సేవలు, రహదారుల అభివృద్ధి, స్వయం ఉపాధి పథకాలు, నైపుణ్యాభివృద్ధిని సమర్ధవంతంగా అమలు చేయడానికి గిరిజన సంఘాల నేతల తగు సలహాలు సూచనలు అందించాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం స్వర్ణాంధ్ర 2047 కింద చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేస్తామన్నారు. పాఠశాల భవనాల నిర్మాణాలకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించామని తెలిపారు. పాఠశాల భవనాలు లేని చోట తాత్కాలిక భవనాలు ఏర్పాటు చేయడానికి ఒక డిజైన్ చేయాలన్నారు. ప్రభుత్వ భూములు, క్వార్టర్లను ఆక్రమించినట్లు తన దృష్టికి తీసుకుని వస్తే తగిన చర్యలు చేపడతామని చెప్పారు. గిరిజన భూములను గిరిజనేతరులు ఆక్రమిస్తే సమాచారం అందించాలన్నారు. మూడు, నాలుగేళ్లో ప్రతి గ్రామానికి రహదారి సదుపాయం కల్పిస్తామన్నారు.

ఆంధ్రప్రదేశ్ ఆదివాసీ జెఎసి నేతలు రామారావు దొర, మొట్టడం రాజాబాబు, కొర్ర బలరాం, రామకృష్ణ, ఎస్.వరలక్ష్మి తది తరులు మాట్లాడుతూ ఆశ్రమ పాఠశాలల్లో మెనూ సక్రమంగా అమలు చేయలేదన్నారు. ఎంపిపి పాఠశాలల ఉపాధ్యాయులు సక్రమంగా విధులకు హాజరుకాలేదని అన్నారు. నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలన్నారు. మారేడు మిల్లి నుండి రాజమండ్రికి బస్సు సౌకర్యం కల్పించాలన్నారు. ఈ సమావేశంలో 22 మండలాల గిరిజన సంఘాల ప్రతినిధులు కె.ఆనందరావు, గోపాల్, ఎస్.అశోక్, కుమార్, కె.సన్యాసిరెడ్డి, గిరిజన విద్యార్థి సంఘం ప్రతినిదులు కిరసాని కిషోర్, ఎం.బాబూజీ తది తరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయానికి ప్రాధాన్యత ఇవ్వాలి

అవగాహన కల్పిస్తున్న సర్పంచ్, సిబ్బంది

ప్రజాశక్తి-డుంబ్రిగుడ: ఏజెన్సీ గిరిజన ప్రాంతంలోని గిరి రైతులు సేంద్రియ ఎరువులతో కూడిన ప్రకృతి వ్యవసాయం చేయడానికి ప్రాధాన్యత నివ్వాలని కొర్రాయి పంచాయతీ సర్పంచ్ పి.కొములు సూచించారు. స్థానిక వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో చిన్న అంజొడ గ్రామంలో బుధవారం పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రసాయన ఎరువులతో పండిన పంటలు వాడటంతో పలు రకాల అనర్థాలు చోటుచేసుకుంటాయన్నారు. సేంద్రియ ఎరువులతో పండిన పంటలను ఉపయోగిస్తే ఆరోగ్యకరంగా ఉంటుందన్నారు. అనంతరం మండల వ్యవసాయ అధికారిణి నీలవేణి మాట్లాడుతూ, ప్రతి ఒక్కరూ ప్రకృతి వ్యవసాయం చేయడానికి కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏపీ సీఎన్ఎఫ్ ఇంచార్జ్ మహేష్, ఐ సిఆర్‌పి యూనిట్ కార్యకర్తలు, సిడబ్ల్యూఎస్ ఎన్జీవో ప్రతినిధి సునీల్ కుమార్, పంచాయతీ రైతులు పాల్గొన్నారు.

మరిన్ని రైళ్లు రద్దు

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ : బంగాళాఖాతంలో ఏర్పడిన దానా తుపాను కారణంగా ఈస్ట్ కోస్ట్ రైల్వే పరిధిలో నడిచే మరో 21 రైళ్లను రద్దు చేస్తున్నట్టు ఈస్ట్ కోస్ట్ రైల్వే సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ కె.సందీప్ తెలిపారు. ఈ నెల 23వ తేదీన 06089 ఎంజిఆర్ చెన్నై సెంట్రల్-సంత్రాగచ్చి స్పెషల్ ఎక్స్‌ప్రెస్, 22606 తిరునెల్వేలి - పురులియా సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్‌లను రద్దుచేశారు. ఈ నెల 24వ తేదీన 22888 ఎస్ఎంవిటి బెంగళూరు- హౌరా హమ్‌సఫర్ ఎక్స్‌ప్రెస్, 11020 భువనేశ్వర్- సిఎస్‌టి ముంబై కోణార్క్ ఎక్స్‌ప్రెస్, 12830 భువనేశ్వర్- ఎంజిఆర్ చెన్నై సెంట్రల్ సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్, 18046 హైదరాబాద్-షాలిమార్ ఈస్ట్ కోస్ట్ ఎక్స్‌ప్రెస్‌లను రద్దు చేశారు. ఈ నెల 25వ తేదీన 12829 ఎంజిఆర్ చెన్నై సెంట్రల్-భువనేశ్వర్ సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్, 08422 గుణుపూర్ - కటక్ మెమూ, 20841 భువనేశ్వర్- విశాఖపట్నం వందేభారత్ ఎక్స్‌ప్రెస్, 17015 భువనేశ్వర్-సికింద్రాబాద్ విశాఖ ఎక్స్‌ప్రెస్, 18463 భువనేశ్వర్- కెఎస్ఆర్ బెంగళూరు ప్రశాంతి ఎక్స్‌ప్రెస్, 20896 భువనేశ్వర్- రామేశ్వరం ఎక్స్‌ప్రెస్, 22883 పూరీ- యశ్వంత్‌పూర్ గరీబ్‌రథ్ ఎక్స్‌ప్రెస్‌లను రద్దు చేశారు. ఈ నెల 26వ తేదీన 22974 పూరి- గాంధీధామ్ ఎక్స్‌ప్రెస్, 12513 సికింద్రాబాద్-సిల్చార్ సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్, 22884 యశ్వంత్‌పూర్ - పూరి గరీబ్‌రథ్ ఎక్స్‌ప్రెస్, 22852 మంగళూరు సెంట్రల్- సంత్రాగచ్చి వివేక్ సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్, 12551 ఎస్ఎంవి బెంగళూరు - కామాఖ్య ఏసీ ఎక్స్‌ప్రెస్, రైళ్లను, ఈ నెల 27వ తేదీన 20895 రామేశ్వరం-భువనేశ్వర్ ఎక్స్‌ప్రెస్, 18048 వాస్కోడగామా-షాలిమార్ అమరావతి ఎక్స్‌ప్రెస్, ఈ నెల 29వ తేదీన 03430 మాల్డా టౌన్ - సికింద్రాబాద్ స్పెషల్ ఎక్స్‌ప్రెస్‌ను రద్దు చేసనట్టు ప్రకటించారు.

ఇంటర్నేషనల్ అంపైర్‌గా శర్మ ఎంపిక

ప్రజాశక్తి - ఎంవిపి కాలనీ : ఎల్ఐసి విశాఖపట్నంలో పనిచేస్తున్న డివిఎస్‌వై శర్మను హర్యానాలోని పంచకులలో జరగనున్న నేషనల్ టేబుల్ టెన్నిస్ చాంపియన్‌షిప్‌కు బ్లూ బాడ్జ ఇంటర్నేషనల్ అంపైర్‌గా ఎంపిక చేసినట్లు టేబుల్ టెన్నిస్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఉత్తర్వులు జారీచేసింది. ప్రస్తుతం ఆయన ఆంధ్రప్రదేశ్ టేబుల్ టెన్నిస్ అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్‌గా, విశాఖపట్నం జిల్లా టేబుల్ టెన్నిస్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శిగా ఉన్నారు. లైఫ్ ఇన్స్యూరెన్స్ కార్పొరేషన్‌లో ఆల్ ఇండియా స్పోర్ట్స్ ప్రమోషన్ మెంబర్‌గా ఉన్నారు.

టయోటా రూమియన్ ఫెస్టివల్ ఎడిషన్ విడుదల

ప్రజాశక్తి - ఎంవిపి కాలనీ : టయోటా కిర్లోస్కర్ మోటర్ (టికెఎం) బుధవారం మద్దిలపాలెంలోని టయోటా షో రూమ్‌లో టయోటా రూమియన్ ఫెస్టివ్ ఎడిషన్‌ను ప్రాంతీయ ప్రతినిధి శబరి మనోహర్ విశాఖ మార్కెట్‌లో విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ప్రత్యేకమైన టయోటా జెన్యూన్ యాక్సెసరీ ప్యాకేజీలను కలిగి ఉన్న లిమిటెడ్-ఎడిషన్ సీజన్‌ను ఆనందంగా జరుపుకోవడానికి సరైన ఎంపికగా నిలుస్తుందని తెలిపారు. రూమియన్ ఈ పండుగ ఎడిషన్, అన్ని గ్రేడ్‌లలో అందుబాటులో ఉందని, వినియోగదారులు ప్రీమియం అనుభవాన్ని ఆస్వాదిస్తున్నారని పేర్కొన్నారు. రూ.20,608 విలువైన డీలర్-ఫిట్టెడ్ టిజిఎ ప్యాకేజీతో లభిస్తుందని, ప్రీమియం యాక్సెసరీలు, విక్రయానంతర సేవలతో పాటుగా పొడిగించిన వారంటీలతో అందిస్తున్నామని తెలిపారు. విశాలమైన ఇంటీరియర్స్, ఇంధన సామర్థ్యం, ఉన్నతమైన భద్రతా, 5-స్పీడ్ మాన్యువల్ ట్రాన్స్‌మిషన్, స్మూత్ 6-స్పీడ్ ఆటోమేటిక్ ట్రాన్స్‌మిషన్ ఎంపివి నియో డ్రైవ్ (ఐఎస్‌జి)తో శక్తివంతమైన కె సిరీస్ 1.5 లీటర్ పెట్రోల్ ఇంజిన్ కలిగి ఉందని ఆయన తెలిపారు.

టాటా మోటార్స్ కస్టమర్ కేర్ మహోత్సవ్

ప్రజాశక్తి- ఎంవిపి కాలనీ : వాణిజ్య వాహన వినియోగదారుల కోసం 'కస్టమర్ కేర్ మహోత్సవ్ 2024'ను ప్రారంభించినట్లు టాటా మోటార్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ గిరీష్ వాఘ్ తెలిపారు. మద్దిలపాలెంలోని టాటా మోటార్స్ కార్యాలయంలో ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఈ కార్యక్రమం బుధవారం నుంచి డిసెంబర్ 24వ తేదీ వరకు నిర్వహిస్తున్నామని చెప్పారు. దేశవ్యాప్తంగా 2500కు పైగా అధీకృత సర్వీస్ అవుట్‌లెట్‌లలో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఫ్లీట్ ఓనర్లు, డ్రైవర్లను కలిసి వారి అభిప్రాయాలను తెలుసుకునేందుకు ఇది వీలు కల్పిస్తుందన్నారు. ఈ మహోత్సవ్ ద్వారా కస్టమర్లు శిక్షణ పొందిన సాంకేతిక నిపుణులచే వాహన తనిఖీలు చేయించుకోవచ్చని, విలువ ఆధారిత సేవలను పొందవచ్చని చెప్పారు. డ్రైవర్లు సంస్థ సంపూర్ణ సేవా 2.0 కార్యక్రమం కింద తగిన ఆఫర్లతో పాటు సురక్షిత, ఇంధన-సమర్థవంత డ్రైవింగ్ పద్ధతులపై శిక్షణ పొందుతారని తెలిపారు.

పరీక్ష ఫీజు తగ్గించిన ఎయు

ప్రజాశక్తి-ఎంవిపీ కాలనీ : ఆంధ్ర విశ్వవిద్యాలయం విద్యార్థుల వినతిని అధికారులు పరిశీలించి ప్రస్తుతం ఉన్న సెమిస్టర్ పరీక్ష ఫీజులో రూ.450 తగ్గిస్తూ నిర్ణయం తీసుకున్నారు. బుధవారం ఏయు ఆర్ట్స్ కళాశాల చెందిన పలువురు విద్యార్థులు అధికారులను కలిసి లిఖిత పూర్వకంగా పరీక్ష ఫీజును తగ్గించాలని, గడువును నవంబర్ 2వ తేదీ వరకు పొడిగించాలని ఎయు వీసీ ఆచార్య జి.శశిభూషణరావు, రిజిస్ట్రార్ ఆచార్య ఇ.ఎన్.ధనంజయరావులకు వినతిపత్రం అందజేశారు. విద్యార్థుల విజ్ఞాపనను పరిశీలించిన అధికారులు వెంటనే ఫీజును తగ్గిస్తూ నిర్ణయం తెలుసుకొని అక్కడికక్కడే సమస్యను పరిష్కరించారు. ఈ సందర్భంగా వీసీ ఆచార్య జి.శశిభూషణరావు మాట్లాడుతూ విద్యార్థులు సమస్యలను నేరుగా తన దృష్టికి తీసుకురావాలని కోరారు. విద్యార్థులకు విశ్వవిద్యాలయంలో స్నేహపూర్వకమైన వాతావరణాన్ని కల్పించామన్నారు. విద్యార్థులు ఉన్నతంగా రాణించాలని సూచించారు. త్వరలో ఏయూలో డ్యూయల్ డిగ్రీ విధానాన్ని సైతం అమలు చేస్తామని చెప్పారు. విద్యార్థులు తమ సమయాన్ని కేవలం జ్ఞాన సంపాదనకు వెచ్చించాలని, ఉన్నత ఆశయాలతో ఎదగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో డాక్టర్ ఆచార్య ఎన్.కిషోర్‌బాబు, విద్యార్థి వ్యవహారాల డీన్ ఆచార్య జి.రాంబాబు, తదితరులు పాల్గొన్నారు.

అవినీతి అధికారులపై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి-రంపచోడవరం : అవినీతికి పాల్పడం, లంచాలు తీసుకునే అధికారులను ఇంటికి పరిమితం చేసే చట్టం తేవాలని ఆదివాసీ సంక్షేమ పరిషత్ జిల్లా అధ్యక్షులు తీగల బాబురావు డిమాండ్ చేశారు. గంగవరం మండలం, రాజంపాలెం గ్రామంలో సంఘం డివిజన్ ప్రధాన కార్యదర్శి చోడి ప్రదీప్ దొర ఆధ్వర్యంలో జరిగిన బుధవారం జరిగిన సమావేశంలో బాబురావు మాట్లాడుతూ దేశానికి స్వతంత్ర్యం వచ్చి 77 సంవత్సరాలైనా నేటికీ ఏజెన్సీ ప్రాంతంలో ఎక్కడి సమస్యలు అక్కడే ఉన్నాయని, వాటిని పరిష్కరించే నాధుడే లేడని ఆవేదన వ్యక్తం చేశారు. ఎంతో మంది అధికారులు వస్తున్నారు, పోతున్నారే తప్ప ఏజెన్సీ చట్టాలు, హక్కులు రక్షించాలనే ఉద్దేశం వారికి లేదని పేర్కొన్నారు. మండల స్థాయి అధికారులు ఇష్టానుసారంగా అవినీతికి పాల్పడుతూ పరోక్షంగా చట్టావ్యతిరేక కార్యక్రమాలను ప్రోత్సాహిస్తూ ఆదివాసీలను అణచివేస్తూ గిరిజనేతరులకు కొమ్ము కాస్తూ ఏజెన్సీలో సమస్యలు పెరిగిపోవటానికి కారణమవుతున్నారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు గోల్లే రవి కుమార్ రెడ్డి, మోడిద నూకరాజు, వీరమణి, బాలుదొర, చిన్నాలు దొర, సుర్ల. సత్యనారాయణ, కె.అబ్బాయి దొర, ఏడుకొండలు, కారు అరుణ కుమారి, వెంకటలక్ష్మి, పీత ప్రసాద్, ఎన్.రాములు, ఎం. పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.

రోడ్లు, కల్వర్టుల నిర్మాణానికి పంచాయతీ తీర్మానం

రోడ్డు నిర్మాణ ప్రాంతాలను పరిశీలిస్తున్న నేతలు

పజాశక్తి-కూనవరం : మండలంలోని రేగులపాడు పంచాయతీలో రోడ్లు, కల్వర్టులు నిర్మాణానికి ఆ పంచాయతీ పాలకవర్గం తీర్మానం చేసింది. రేగులపాడె ఎంపీటీసీ, కూనవరం వైస్ ఎంపీపీ కొమరం పెంటయ్య పర్యవేక్షణలో సర్పంచ్ బొగ్గా రామారావు అధ్యక్షతన బుధవారం సమావేశం జరిగింది. రేగులపాడు గ్రామంలో రెండు ప్రాంతాలలో కల్వర్టులు, బొజ్జ రాయిగూడెంలో మూడు చోట్ల గ్రావెల్ రోడ్లు పనులు చెయ్యడానికి రేగులపాడు పంచాయతీ వార్డు సభ్యులు మెజారిటీతో తీర్మానం చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ బొగ్గా రామారావు మాట్లాడుతూ పంచాయతీలో వీధి దీపాలు, మంచి నీటి సమస్యలు పరిష్కరించే విధంగా పని చేస్తామన్నారు. తీర్మానం చేసిన పనులు నెల రోజుల్లో పూర్తి చేసే విధంగా ప్రయత్నం చేస్తామని చెప్పారు. అనంతరం గ్రామాల్లో కల్వర్టులు, రోడ్డు నిర్మించే ప్రదేశాలను పరిశీలించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రాయి నాగు, ఉపసర్పంచ్ నానుపల్లి హరిబాబు, వార్డు సభ్యులు బొగ్గా సుబ్బమ్మ, బొగ్గా ముతయ్య, బొగ్గా అచ్చమ్మ, మూట చంద్రమ్మ, సచివాలయం ఇంజనీరింగ్ అసిస్టెంట్ మహేష్, మాజీ సర్పంచ్ తిమ్మ అప్పన్న, రేగులపాడు మాజీ గ్రామ శాఖ కార్యదర్శి గుండం బాబురావు, శాఖ సభ్యులు బొగ్గా రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

26న జాబ్ మేళా

ప్రజాశక్తి-రంపచోడవరం : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్య అభివృద్ధి సంస్థ (ఎపిఎస్-ఎస్‌డిసి) జిల్లా ఉపాధి కార్యాలయం, సీడాప్ సంయుక్త ఆధ్వర్యంలో రంపచోడవరం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈనెల 26వ తేదీన (శనివారం) ఉదయం 10 నుండి సాయంత్రం 3 గంటల వరకు 2 కంపెనీలతో జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు ఎపిఎస్-ఎస్‌డిసి అధికారి డాక్టర్ పి.రోహిణి తెలిపారు. ఈ జాబ్ మేళాలో డైకిన్, కేర్ ఫర్ యు అను ప్రముఖ కంపనీలు పాల్గొంటున్నాయని పేర్కొన్నారు. జిల్లాలోని 18 నుండి 35సంవత్సరాల మధ్య గల పదవ తరగతి, ఇంటర్మీడియట్, డిప్లొమా, డిగ్రీ ఆపై చదువు పూర్తి చేసిన నిరుద్యోగ యువతీ యువకులు ఇంటర్వ్యూలకు బయో డేటా, పాన్ కార్డు, ఆధార్ కార్డు, సరిఫికేట్స్ జిరాక్స్ కాపీలతో హాజరు కావాలని కోరారు. ఇంటర్వ్యూలో ఎంపిక కాబడిన అభ్యర్థులకు నెలకు జీతం రూ.10వేలు నుండి రూ.20వేలు వరకు జీతం ఇవ్వటం జరుగుతుందని తెలిపారు. ఈ సదవకాశాన్ని జిల్లాలోని నిరుద్యోగ యువతీ యువకులు సద్వినియోగ పరుచుకోవాలని కోరారు. మరిన్ని వివరాలకు www.naipunyam.ap.gov.in లేదా 9163046 34447, 9398338105 నెంబర్లను సంప్రదించాలని ఆమె కోరారు .

సిసి రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం

సిసి రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభిస్తున్న సర్పంచ్, ఎంపిటిసి

ప్రజాశక్తి-సీలేరు : జీకే వీధి మండలం గాలికొండ పంచాయితీ జాజిగొంది గ్రామంలో ఎన్ఆర్ఇజిఎస్ నిధులు రూ.6 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణ పనులను ఆ పంచాయతీ సర్పంచి కాకూరు బుజ్జిబాబు, గాలికొండ ఎంపీటీసీ అంపరంగి బుజ్జిబాబు బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపిటిసి అపరంగి బుచ్చిబాబు మాట్లాడుతూ స్వాతంత్రం వచ్చి 78 ఏళ్ల గడుస్తున్నా గాలికొండ పంచాయతీ పరిధి మారుమూల జాజిగొంది గ్రామం ఏ అభివృద్ధికి నోచుకోలేదని విచారం వ్యక్తం చేశారు. ఎట్టకేలకు జాజిగొంది గ్రామానికి సీసీ రోడ్డు నిర్మాణం ఆనందంగా ఉందన్నారు. పంచాయతీ పరిధిలో అనేక గ్రామాల్లో వీధి రోడ్లు లేక ఇబ్బందులు పడుతున్నారని, పంచాయితీ నిధులు, ఎన్ఆర్ఇజిఎస్ నిధులు అధికారులు కేటాయించి సిసి రోడ్ల నిర్మాణం చేయాలని కోరారు. జనాభా ప్రాతిపదికన గాలికొండ పంచాయితీలో తక్కువగా ఉండడంతో పంచాయతీకి నిధులు తక్కువగా మంజూరు చేయడంతో దీని పరిధిలోని గ్రామాలు అభివృద్ధి జరగడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. పంచాయతీకి వచ్చిన ఆరకొర నిధులతో బ్లీచింగ్, పినాయిల్ వీధిలైట్లు కొనుగోలు చేయడానికి నిధులు సరి పెట్టుకోవాల్సిన పరిస్థితి ఏర్పడదని వాపోయారు. జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్, ఐటిడిఏ పిఓ అభిషేక స్పందించి గాలికొండ పంచాయతీ పరిధి గ్రామాల అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ ఇంజనీరింగ్ అసిస్టెంట్ కిరణ్, టిడిపి నాయకులు కొర్ర పాండు, గ్రామస్తులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణపై అవగాహన

అవగాహప కల్పిస్తున్న ఎస్ఐ

ప్రజాశక్తి-కొయ్యూరు : రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరూ సహకరించాలని మంప ఎస్ఐ ఎస్.శంకరరావు పిలుపునిచ్చారు. కొయ్యూరు మండలం మంప గ్రామంలో ఆయన బుధవారం పర్యటించి గ్రామస్థులతో సమావేశమయ్యారు. రోడ్డు ప్రమాదాల నివారణపై అవగాహన కల్పించారు. వాహనదారులు ఖచ్చితంగా రహదారి నిబంధనలు పాటించాలని, ద్విచక్ర వాహనదారులు ఖచ్చితంగా హెల్మెట్ ధరించాలని సూచించారు. అతివేగం ప్రమాదమని, మైనరులకు వాహనాలు ఇవ్వకూడదని, మద్యం తాగి వాహనాలు నడపరాదని కోరారు.

జిఒ 3 పునరుద్ధరణపై సిఎం మాట నిలబెట్టుకోవాలి

నిరసన వ్యక్తంచేస్తున్నఆదివాసీలు

ప్రజాశక్తి-రంపచోడవరం: 2024 సార్వత్రిక ఎన్నికల్లో నారా చంద్రబాబు నాయుడు అరకు బహిరంగ సభలో తమ ప్రభుత్వం వచ్చిన వెంటనే జిఒ నెంబర్ 3ను పునరుద్ధరిస్తామని ఇచ్చిన మాటను ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నిలబెట్టుకోవాలని ఆదివాసీ ఉద్యోగుల సంక్షేమ, సాంస్కృతిక సంఘం నాయకులు కంగల శ్రీనివాసు డిమాండ్ చేశారు. తెలుగుదేశం ప్రభుత్వం జిఒ 3 పునరుద్ధరణకు హామీ ఇవ్వడంతో 7 ఎస్టీ అసెంబ్లీ స్థానాలకు గాను 5 స్థానాలను టిడిపి నెగ్గించుకోవడం జరిగిందని తెలిపారు. అందువల్ల ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు జిఒ 3ను పునరుద్ధరణకు చట్టం చేసి ఆదివాసీలు చెడు వ్యసనాల వైపు వెళ్లకుండా వారిలో వెలుగులు నింపాలని కోరారు. ఈ కార్యక్రమంలో పోడియం పండు దొర, మట్ల కృష్ణారెడ్డి, చవలం శుభకృష్ణ, మడకం ప్రసాద్, పండ పవన్, కారం రామన్న దొర, కె.సన్యాసిరెడ్డి కె.రమణరెడ్డి పాల్గొన్నారు.

పిహెచ్‌సిలో కంటి వైద్య శిబిరం

ప్రజాశక్తి-కొయ్యూరు: మండలంలోని రాజేంద్రపాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో బుధవారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో సుమారు 100 మంది రోగులకు కంటి పరీక్షలు చేసినట్లు పీహెచ్సీ వైద్యాధికారి డాక్టర్ సంపత్ బాబు, సీహెచ్వో ప్రశాంత్ కుమార్ తెలిపారు. వారిలో 30 మందికి కంటి శస్త్ర చికిత్స అవసరమని గుర్తించి, వారికి ప్రత్యేక బస్సు సౌకర్యం కల్పించి, విజయనగరం కంటి ఆసుపత్రికి తరలించామని పేర్కొన్నారు.

ఇండియా-ఏ జట్టులో నితీష్, రికీ బుయ్

-అభినందనలు తెలిపిన ఎసిఎ కార్యదర్శి సతీష్‌బాబు

ప్రజాశక్తి -మధురవాడ : ఆస్ట్రేలియాలో పర్యటించే భారత్-ఎ జట్టులో ఆంధ్రాకు చెందిన యువ క్రికెటర్లు కె.నితీష్‌కుమార్‌రెడ్డి, రికీ భుయ్‌లకు చోటు దక్కడంపై ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ (ఎసిఎ) కార్యదర్శి సానా సతీష్‌బాబు హర్షం వ్యక్తం చేసి అభినందనలు తెలిపారు. 15 మంది సభ్యులతో కూడిన ఇండియా-ఎ జట్టును బిసిసిఐ ప్రకటించగా, దానిలో వీరు చోటు దక్కించుకున్నారు. భారత్-ఎ జట్టు ఆస్ట్రేలియా -ఎ జట్టుతో రెండు ఫస్ట్‌క్లాస్ మ్యాచ్‌లు ఆడుతుంది. తర్వాత పెర్త్‌లో టీమిండియా ఆటగాళ్లతో కలిసి అంతర్గత ప్రాక్టీస్ మ్యాచ్ ఆడనున్నారు.

ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి-రంపచోడవరం : ఎన్టీఆర్ మెమోరియల్ ట్రస్ట్, జిఎస్ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో డాక్టర్ గోరంట్ల రవిరామ్ కిరణ్ మండలంలోని ఊట్ల, రామన్నపాలెం గ్రామాల్లో బుధవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. కందుల సాయిబాబు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ శిబిరంలో ఊట్ల మరియు రామన్నపాలెం గ్రామ ప్రజలు వైద్య సేవలు పొందారు. ఈ కార్యక్రమంలో కంగల అబ్బాయిదొర, ఊట్ల సర్పంచ్ లక్ష్మి, తెలుగు యువత అధికార ప్రతినిధి సాగర వీర వెంకట చిన్నాలు దొర పాల్గొన్నారు.

టిడిపి నేత ప్రకాష్‌కు జమాల్ ఖాన్ పరామర్శ



పరామర్శిస్తున్న జమాల్‌ఖాన్

ప్రజాశక్తి-కూనవరం : తెలుగుదేశం పార్టీ కూనవరం మండల అధ్యక్షులు బరపాటి ప్రకాష్ తల్లి మృతి చెందిన విషయం తెలుసుకున్న చింతూరు ఆయుర్వేద వైద్యులు మొహమ్మద్ జమాల్ ఖాన్ బుధవారం ప్రకాష్ ఇంటికి వెళ్లి ఆ కుటుంబాన్ని పరామర్శించారు. తల్లి లేని లోటు ఎవరో తీర్చలేనిదని, గుండె నిబ్బరంతో ఉండాలని ప్రకాష్‌ను ఓదార్చారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ పోడియం అప్పారావు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

గ్రామాల్లో 'పొలం పిలుస్తోంది'

రైతులకు సూచనలు చేస్తున్న వ్యవసాయాధికారులు

ప్రజాశక్తి-కొయ్యూరు : మండలంలోని శరభన్నపాలెం, వెలగలపాలెం, నడింపాలెం గ్రామాల్లో బుధవారం వ్యవసాయ శాఖ అధికారులు పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఇటీవల కురిసిన వర్షాలకు కింద పడిపోయిన వరి పొలాలను పరిశీలించారు. క్షేత్ర సందర్శన చేసిన డిఎఎటిసిసి శాస్త్రవేత్త డాక్టర్ పిబి.ప్రదీప్ కుమార్ పడిపోయిన వరి పొలాలను కట్టలుగా కట్టి నిలబెట్టాలని, నీరు ఉంటే తీసేయాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయ అధికారి విజయలక్ష్మి, మండల వ్యవసాయ అధికారి ఉమాదేవి, ఏఈఓ సత్యనారాయణ, విఎఎలు, విహెచ్ఎలు, ఎన్‌జిఒలు, రైతులు పాల్గొన్నారు.

ఆధార్ శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి-కొయ్యూరు : మండలంలోని బూదరాళ్ళ, రాజేంద్రపాలెం, రేవాళ్ళు మంప గ్రామ సచివాలయాల్లో ఈ నెల 22 నుంచి 25 వరకు జరుగుతున్న ఆధార్ శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని ఏవో బాలమురళీకృష్ణ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 18 ఏళ్లు నిండిన వారు ఆధార్ కార్డుల్లో మార్పులు చేర్పులు చేసుకోవచ్చని, పాత కార్డులు తప్పనిసరిగా అప్డేట్ చేసుకోవాలని సూచించారు